# నాగేటి చాలు

పోస్ట్‌మాన్ తెచ్చిన రిజిష్టర్ ఉత్తరం అందుకుంటుంటే చలమయ్య చేతులు సన్నగా వణికాయి. గుండె దడ దడలాడింది. అలాంటివి గతంలో అనేకం వచ్చి, జీవనవృక్షాన్ని కొమ్మకొమ్మగా నరుక్కుంటూ వెళ్లాయి. ఇక సవినయంగా సమర్పించుకోవటానికి మిగిలింది తలొక్కటే.

చలమయ్య ఆత్రంగా కవరు చించాడే కాని, తానుగా చదివి విషయం తెలుసుకోగలిగిన అక్షరజ్ఞానం వుంటేగా! రచ్చబండ మీద కూర్చుని కబుర్లాడుతున్నవారిలో చదవగలిగినవాళ్లు లేకపోలేదు. కాని పదిమంది దృష్టికీ విషయం వెళ్లటం ఇష్టం లేకపోయింది.

ఇంటికెళ్లేదారిలో బంధువుల కుర్రాడు ఒంటరిగా తారసపడ్డాడు. చదివి విషయం చెప్పమని కవరు అతని చేతిలో పెట్టాడు.

గుంటూరు నుండొచ్చిన ప్లీడరు నోటీసది.

సుభద్రా ఫైనాన్స్ గుంటూరు వారి నుండి ఋణంగా తెచ్చిన నలభైఐదువేలు రొక్కం, అసలు ఫాయిదాలతో తక్షణమే చెల్లించాలనీ, లేకుంటే చట్టపరమైన చర్యలకు సిద్ధపడమనీ సారాంశం.

అప్పట్లో శంకరం అప్పు తెచ్చిన మాట నిజమే! వ్యవసాయ ఖర్చులకోసం, పీకల మీదున్న చిల్లర బాకీలు తీర్చటం కోసం ఇరవైవేలు అవసరపడ్తే రాజారావు ఇప్పించాడు. వడ్డీ లెక్కలు ఎట్లా వేసుకున్నా మూడేళ్లకు నలభైవేలు కూడా కాదే! అసలు నలభైఐదు వేలంటాడేమిటి? రాసుకున్న కాగితాల్లో తఖరారు చేసేరనుకోవటానికి శంకరం చదువు రానోడేం కాదే!

ఇల్లు చేరుతూనే కొడుకు ఇంట్లో లేని సంగతి పసిగట్టి, "శంకరం ఏడి?" అడిగాడు భార్యని.

"పొయ్యిలోకి పుల్లలు అయిపోవచ్చినై. పత్తికట్టె ఏసుకురమ్మంటే ఎల్లాడు". భర్త చిర్రు బుర్రులాడటం గమనిస్తూనే చెప్పింది సత్యవతి.

"పని కెల్లినోడు తిన్నగొత్తేగా! యాడ పెత్తనాలు కొడ్తన్నాడో!" చిరాగ్గా అనుకున్నాడు.

కొడుకు గురించి భర్త ఎందుకలా చిర్రు బుర్రులాడుతున్నాడో సత్యవతికి అర్థం కాలేదు. అదేమని అడిగితే సమాధానం రాకపోగా ఇంకా కస్సు బుస్సులాడతాడు. అందుకే మరో ప్రశ్న వేయలేదామె.

కాసేపటికి శంకరం వగరుస్తూ బండెడు పత్తికట్టె మోసితెచ్చి దొడ్లో పడేశాడు. తల కండువా దీసి కారుతున్న చెమట ధారలు తుడుచుకుంటూ పంచలోకి వచ్చాడు.

తండ్రీ కొడుకుల మధ్య తలెత్తబోతున్న వివాదం గురించే సత్యవతి ఆందోళన పడసాగింది.

"ఏరా! అప్పట్లో రాజారావు గుంటూరులో ఇప్పించింది ఎంత?" సూటిగా ప్రశ్నించాడు చలమయ్య.

ఆ ప్రశ్నకు శంకరం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఇంత హఠాత్తుగా ఆ వివరం తండ్రికి ఎందుకు కావలసి వచ్చిందో అర్థం కాలేదు. తండ్రి ముఖకవళికలు అతన్ని కలవరపెట్టాయి.

"ఇరవై వేలనుకుంటాను" అన్నాడు కలవరపాటును అణచిపెడ్తూ.

చలమయ్య విసురుగా జేబులో నుండి రిజిష్టర్ ఉత్తరం బయటకు లాగి శంకరం చేతికిస్తూ, "అయితే ముండాకొడుకు ఇలా ప్లీడరు నోటీసు ఇచ్చాడేమిట్రా! కోర్టు కీడుస్తాడట కోర్టుకి...." అంటూ కోపంతో ఎగిరిపడ్డాడు.

శంకరం నోటీసు చదువుకున్నాడు. అందులో వున్న విషయం అతనికి చెమటలు పట్టించింది.

నిజం దాచి ఎవరినైనా ఎంతకాలం మభ్యపెట్టగలరు! ఏదో రోజు నిజం బయటపడి తను దోషిలా, ద్రోహిలా అందరి ముందూ నిలబడక తప్పదు. ఇప్పటికైనా వాస్తవం తండ్రికి చెప్పటం మంచిదనుకున్నాడు. గుండె దిటవుపరుచుకున్నాడు.

"వాళ్లు రాసింది అబద్ధం కాదు". ఉత్తరం మడిచి నీళ్లు నములుతూ అన్నాడు శంకరం.

చలమయ్య పిడుగుపాటుకు గురైనట్లు అదిరిపడ్డాడు. ఆవేశం కట్టలు తెంచుకుంది.

"మరి మిగిలిన పాతికవేలు ఏవి? పేకాట క్లబ్బుల్లో తగలేశావా? తాగి తందనాలాడావా? ముండలకు పెట్టావా?" అంటూ శంకరం మీదకు పులిలా ఉరికి మెడపట్టుకున్నాడు.

లోపల్నుండి సత్యవతి పరుగున వచ్చి కొడుకును ఇవతలకు లాగింది. "ఏందయ్యా! మనం ఎండలో కష్టపడుతుంటే ఆడేవన్నా నీడలో కూచున్నాడా? మనం పచ్చడి మెతుకులు తింటుంటే ఆడేవన్నా పరమాన్నాలు మింగుతున్నాడా! ఆడెలాంటోడో నీకు తెలవదా?" దుఃఖం ముంచుకొచ్చిందామెకు.

"నీ కొడుకు సత్య హరిశ్చంద్రుడేనే! ఆ పాతిక వేలు ఏమైనట్టు చెప్పమను". నిలదీశాడు తల్లీ కొడుకుల్ని.

* * *

శంకరం రైలు దిగి రాజారావు ఇంటికి వెళ్ళేసరికి రాత్రి ఏడు కావస్తున్నది. అప్పటికే రాజారావు ఆఫీసునుండొచ్చి స్నేహితులతో ముచ్చటిస్తున్నాడు.

ఊర్నుండొస్తూ తెచ్చిన కందిపప్పుమూట లోపల పెట్టి వరండాలోకొచ్చి రాజారావుతో పాటు కూర్చున్నాడు.

"అంతా కులాసేనా! ఇదేనా రావటం?" పలకరింపుగా అడిగాడు రాజారావు.

"అవునన్నా! నాలుగ్గంటల బండికొచ్చినా! ఉదయం బండి కొద్దామంటే ఆవేళకు ఆఫీసుకెళ్లే తొందర్లో వుంటావాయె!" అన్నాడు శంకరం.

"అదీ నిజమేలే!" అంటూ రాజారావు నవ్వి, స్నేహితులతో మాటల్లోకి దిగాడు.

"నీ అభిప్రాయం చెప్పు రాజా!" మిత్రులిద్దర్లో ఒకతను అందుకున్నాడు.

"గుడ్ ఎస్డా మంచిది కాబట్టే ఆ కంపెనీ షేర్ మార్కెట్లో నూటయాభై అంటే ఎగరేసుకెళ్తున్నారు. ఇప్పుడు అదే కంపెనీ ప్రమోట్ చేస్తున్న స్టీల్స్‌కి కూడా మంచి భవిష్యత్తు వుండొచ్చు. ప్రమోటర్స్ కోటాలో మనకు పదిరూపాయల షేర్ ఇరవై ఐదు రూపాయల కొస్తుంది. అంటే, పదిహేను పెచ్చు. రెండు మూడు నెలల్లో పబ్లిక్ ఇష్యూ కొస్తాడు. నాకు తెలిసి గుంటూరులో బ్రోకర్లు ఇప్పటికి లక్షషేర్లపైనే అమ్మారు. మంచి డిమాండ్ వుంది". చెప్పుకొచ్చాడు రాజారావు.

"నీ అంచనా ఎంత లాభం రావచ్చని?" అడిగాడు మరో మిత్రుడు.

"పబ్లిక్ ఇష్యూకొచ్చిన కొద్దినెలల్లోనే షేర్ వంద పలకొచ్చు".

"అంటే, ఏడాదిలోనే మూడు రెట్లు లాభిస్తామన్నమాట. అయితే ఒక పని చేస్తా. నా దగ్గర స్టింక్ షేర్లు రెండొందలున్నాయి. వందకు మించి పెరగటం లేదు. అవమ్మితే ఇరవై వేలొస్తాయి. గుడ్ ఎస్డా ఎనిమిది వందలు నాపేరన బుక్ చెయ్యి" చెప్పాడొక మిత్రుడు.

"నాకూ ఒక వెయ్యి బుక్ చెయ్యి. బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ కాన్సిల్ చేసి తెస్తా. ఏడాదిలో రెండు రెట్లు పెరిగితే మాత్రం లాభం కాదూ!" అంటూ మరో మిత్రుడు తన నిర్ణయం చెప్పాడు.

"ఒకే! అలాగే! బ్రోకర్‌కి చెప్తాను" అన్నాడు రాజారావు.

రాజారావు మిత్రులిద్దరూ శలవు తీసుకున్నారు. అతను స్నానం చేశాక ఇద్దరికీ భోజనాలు వడ్డించింది రాజారావు భార్య.

"ఏదో పనిబడే వచ్చినట్లున్నావు!"

"ఏం పనుల్లే! ఊళ్లో వుంటే అరక్కి, ఊరొదిలితే అప్పుకేగా మేం సాగారేది? తొలకరొస్తుంది. వ్యవసాయానికి పెట్టుబడి కావాలి" చెప్పాడు శంకరం నవ్వుతూ.

"బ్యాంకీవాళ్లు అగ్రికల్చరల్ లోన్ ఇస్తారుగదా! ఫైనాన్స్ కంపెనీలంటే వడ్డీ పెచ్చవుతుంది".

"పాత బాకీ చెల్లిస్తేగా కొత్తబాకీ పుట్టేది! అన్ని దారులూ మూసుకుపోయాకనే ఈ దారి పట్టింది".

"ఎంత అవసరమంటావు?"

"వ్యవసాయానికి పదిహేను, చేబదుళ్ళకి ఐదు. మొత్తం ఇరవైవేలు".

"అప్పంటే తనఖా పెట్టాలిగా!"

"మా రైతుల తలలు తనఖాలకు పనికొచ్చేపాటి విలువలేనివి గందా! పొలం దస్తావేజులు తెచ్చినా!"

"అవి పెట్టినా ఇవ్వడం కష్టంరా!"

"మా కష్టాలు ఎరిగినోడివి గనుకనే ఇప్పిస్తావని అయ్య పంపాడు. బంగారం తెద్దామంటే, యాడుందన్నా? ప్రతియేడూ మా మొక్కల్నిబట్టే పురుగు ఆడోళ్ళ బంగారం తినేగదన్నా అంతో ఇంతో పంట చేతికందనిస్తంది. నువ్వే నచ్చజెప్పాలి". నిరాశగా అన్నాడు శంకరం.

ఇద్దరూ భోజనం చేసి ఆరుబయట కుర్చీలు వేసుకుని చల్లగాలికి కూర్చున్నారు. ఊరిలో అయినవాళ్ల మంచి చెడ్డలు, రాజకీయాల గురించి కాసేపు చర్చలు సాగాయి.

"అన్నా! ఇందాక మీరు మాట్లాడుకున్న విషయాలు కాస్త నా చెవి కెక్కినయిలే. మనూళ్లో కూడా ఈ మధ్య కొందరు చెప్పుకోవటం విన్నాను. షేర్లంటే ఏమిటి?" అడిగాడు ఆసక్తిగా శంకరం.

"కొత్తగా ఒక కంపెనీ పెట్టాలనుకుంటే మూలధనం అవసరం గదా! కంపెనీ తనకు కావలసిన మూలధనాన్ని చిన్నచిన్న వాటాలుగా జారీచేయడం ద్వారా సమకూర్చుకుంటుంది. ఆ వాటాలనే షేర్లు అంటారు. వాటి కనీస విలువ పది రూపాయలుగా వుంటుంది. దరఖాస్తుదారులకు సాధారణంగా వంద లాట్లుగా ఇస్తుంటారు. అలా స్థాపించబడిన ఆ కంపెనీ సామర్థ్యం, ఆర్జించే లాభాలను బట్టి ఆ వాటాల విలువ వందల్లో పెరగొచ్చు" – ఓపిగ్గా చాలా విషయాలు చెప్పాడు రాజారావు.

రాత్రి చాలాసేపు శంకరానికి నిద్రపట్టలేదు.

"ఏడాదిలోగా మూడురెట్ల లాభం" అన్న మాటలే అతని చెవుల్లో గింగురు మంటున్నాయి.

తనలాంటి పల్లెటూరి గబ్బిలాయిలకు ఇవన్నీ ఏం తెలుస్తాయి! జీవితాంతం తన శక్తినంతా భూమికి ధారపోసి తండ్రి ఏం బావుకున్నాడు? తను మాత్రం ఏం బావుకుంటున్నట్లు! బ్రతుకును కష్టాలతో పేనుకుంటూ ఒక రాటకు కట్టేసుకు తిరగడమేగా! వారసత్వంగా ఆ తాడే తన మెడకు బిగుస్తున్నది. స్కూలుఫైనల్ దాటని తన చదువూ నిరర్థకమైంది.

చదివి ఉద్యోగాలు చేస్తూనో, తెలివితేటలతో వ్యాపారాలు చేసుకుంటూనో ఎండవేడికి అందక, చినుకు తడికి చిక్కక, పట్టణాలలో జనం ఎంత ఆనందంగా బ్రతుకుతున్నారు! ఏ పూట కష్టాన్ని ఆ పూటకు కుండ కెక్కించుకు తినే కూలినాలి జనం బాధలు, బ్రతుకులూ తమలాంటివే కావచ్చు.

ప్రకృతి ప్రతికూల శక్తులతో తలపడుతూ ముడి సరుకుల్ని ఉత్పత్తి చేస్తే దళారులకు, వ్యాపారులకు దండుకోగలిగినవాడికి దండుకున్నంత. వ్యవసాయ ఉత్పత్తుల్ని చవకగా కొనుగోలు చేసే పరిశ్రమలకు రెట్టింపు లాభాలు. పట్టణాలకు సకల సౌభాగ్యాలనందిస్తూ పల్లెలు దరిద్రాన్ని పంచుకుంటున్నాయి.

నగరాల్లో వానొస్తేనేం, రాకుంటేనేం! అతివృష్టయితేనేం, అనావృష్టయితేనేం! ఎండేదేముంది! మునిగేదేముంది! పండేదేముంది! ఎవరికందాల్సిన సౌఖ్యాలు వాళ్లకందాల్సిందే! పంపకాల్లో తేడాలొస్తే మీటింగులు, సమ్మెలు, నిరసనలు, ధర్నాలు, సమ్మెలు! హక్కులకోసం ఐక్యపోరాటాలు!

ఎలాంటి శక్తి యుక్తులూ లేకుండా మూగజీవాల్లా పల్లెల్లో పడుంటున్నది తామే గదూ! దోపిడీదార్ల కసాయితనానికి అమాయకంగా తమ తలలే కదూ తెగుతున్నది!

దారీ తెన్నూ తోచక నిస్తేజమవుతున్న జీవితాన్ని గట్టెక్కించాలి. గాలి వాలును బట్టి తెరచాప ఎత్తితేనే పడవ సులువుగా, వేగంగా ఒడ్డుకు చేరేది. దిశ మారిస్తేనే దశ తిరిగేదనుకున్నాడు శంకరం.

"అన్నా! మరో పాతిక వేలు అదనంగా ఇప్పించాలి". ఉదయం బయల్దేరే ముందు రాజారావును అడిగాడు శంకరం.

"అదేమిటి! రాత్రి ఇరవై చాలన్నావుకదా!"

"అన్నాననుకో! ఆ పాతిక వేలుబెట్టి మీతోపాటు నేనూ వెయ్యి షేర్లు కొందామను కుంటున్నా".

ఆ మాటలకు రాజారావు ఆశ్చర్యపోయాడు. "తెలీనీ తెలిసీ వ్యాపారాల్లో తల దూరుస్తావెందుకు?" అన్నాడు.

"నమ్మినోడికి సొమ్ము, నమ్మనోడికి దుమ్ము అన్నారు. కలుసుబాటు లేని వ్యవసాయాన్ని బట్టుకుని ఎంతకాలం వేలాడమంటావు! రూపాయికీ రూపాయి పోవటమేగాని ఏం దక్కుతున్నది! ఈ రకంగానైనా నాలుగు రూపాయిలు మిగిల్తే అప్పులు తీర్చి చెల్లెలి పెళ్లి చేస్తాం. కాదనకన్నా!" ప్రాధేయపడ్డాడు శంకరం.

"పొలం మీద అంత అప్పు ఇవ్వొద్దూ?"

"అదేంటన్నా! తనఖా పెడ్తున్న నాలుగెకరాల పొలం విలువ లక్షపైనే వుంటది. షేర్లు మంచి రేటు రాగానే అతని డబ్బు వడ్డీతో సహా తీరుస్తాం గదా!" చెప్పాడు శంకరం.

"ఆలోచన బాగానే ఉంది. మీ నాన్న కివన్నీ ఇష్టం వుండొద్దూ?" అనుమానం వ్యక్తం చేశాడు రాజారావు.

"నాన్నకు తెలవకుండానే బాకీ సర్దుబాటు చేసుకుందాం" అన్నాడు శంకరం.

రాజారావు ఫైనాన్స్ కంపెనీవాళ్లకు నచ్చచెప్పటంతో రుణంగా అడిగినంత ఇవ్వటానికి అంగీకరించారు. తండ్రిచేత అవసరమైన కాగితాల మీద వేలు ముద్రలు వేయించుకొచ్చాడు. తనూ సంతకాలు పెట్టాడు.

డబ్బు తీసుకున్న వెంటనే పాతికవేలు రాజారావు చేతికిచ్చి షేర్లు కొని పెట్టమన్నాడు. ఇరవైవేలు తండ్రికిచ్చాడు. అప్పుతీసుకున్నది అంతేననుకున్నాడాయన.

పనుల ఒత్తిడి తగ్గిన తర్వాత గుంటూరు వెళ్లి రాజారావును కలిశాడు. షేర్ సర్టిఫికెట్‌లు తీసి శంకరానికివ్వబోయాడు.

"నా దగ్గరెందుకన్నా! నాన్న కంటబడి ఏమిటని నిలదీస్తాడు. సమాధానం చెప్పలేక చస్తాను. ఇక్కడే వుంచు". తీసుకోలేదు శంకరం.

శంకరం ఏడెనిమిది నెలల తర్వాత తిరిగి గుంటూరు వెళ్లాడు.

"ఏవన్నా! షేర్లు రేటు ఎంత పెరిగినై?" ఆసక్తిగా అడిగాడు.

"ఈపాటికీ కంపెనీ పబ్లిక్ ఇష్యూకి వచ్చి వుండాల్సింది. రాలేదు. ఒక షేర్ ఇన్ఫర్మేషన్ పేపర్‌లో ఆ కంపెనీ గురించి అనుమానాస్పదంగా రాసారు" చెప్పాడు రాజారావు.

ఆ మాటలకు శంకరం భయపడ్డాడు. "కొంపదీసి కథ అడ్డం తిరిగితే నిలువునా మునిగినట్లేన్నా!" అన్నాడు ఆందోళనగా.

"అంతగా కంగారు పడనక్కరలేదు. కాకపోతే అనుకున్నంత లాభం రాకపోవచ్చు నంతే!" ధైర్యం చెప్పాడు రాజారావు.

శంకరం మనస్సులో అనుమాన బీజం పడనేపడింది. తొందరపాటుతో ఇందులో తల దూర్చలేదు కదా అనుకున్నాడు.

ఫైనాన్సియర్స్ నుండి ఉత్తరం వచ్చింది. అది తండ్రి చేతిలో పడనందుకు సంతోషించాడు. అప్పు ఇచ్చి సంవత్సరం దాటిందనీ, అనుకున్న మాట ప్రకారం వడ్డీ చెల్లు పెట్టాల్సిందనీ సారాంశం. శంకరానికి కాళ్లూ చేతులాడలేదు.

రాజారావును కలిసి ఉత్తరం చూపాడు. కొంత గడువిచ్చేలా చూస్తానని హామీ ఇచ్చాడతను.

"షేర్లు కొని సంవత్సరం దాటింది కదా! ఒకరెట్టన్నా పెరగలేదంటావా?" ఆశగా అడిగాడు శంకరం.

"ఏం పెరగటమోరా! ఇన్‌కంటాక్స్ దాడి జరిగి ఆ కంపెనీ ఛైర్మన్‌ను అరెస్ట్ కూడా చేశారట. ఆ మధ్యనే పేపర్లో చదివాను. తప్పటడుగు వేశామేమోననిపిస్తుంది" అన్నాడు రాజారావు.

శంకరానికి నిలువెల్లా చెమటలు పోసుకొచ్చాయి. ఆశలన్నీ కుప్పకూలి పోతున్నట్లనిపించింది.

కొద్ది నెలల తర్వాత ఫైనాన్సియర్స్ దగ్గర్నుండి రిజిష్టర్ ఉత్తరం వచ్చింది. తండ్రి తన చేతికే ఇచ్చి విషయం ఏమిటని అడిగాడు. తెచ్చిన ఇరవైవేల అప్పుకు వడ్డీ జమవేయించమని రాసేరన్నాడు.

"తెచ్చిందంతా ఎరువులకు, పురుగు మందులకు పోస్తిమి. పండిన పంట సగం పురుగు తినిపోయె. తినక దిగిడిచిన పంటనేమో తోచినకాడికి లెక్కగట్టి దళారీలు తిన్నారు. మనకేం మిగిలింది! అప్పులు, అవసరాలు! ఈ యేడన్నా పిల్లకు సంబంధం చూద్దామనుకుంటే, బతుకులు ఇట్లా కుంటుతావుండె". తండ్రి కళ్లనీళ్ల పర్యంతమయ్యాడు.

"అన్నా! ఎంతో కొంతకు అమ్మిపెట్టు. అసలుకు, వడ్డీకి సరిపడా వచ్చినా చాలు. ఎంతకాలం అయ్యకు తెలవకుండా దాచగలను?" రాజారావును కలిసి బ్రతిమాలుకున్నాడు.

రాజారావు భారంగా నిట్టూర్చాడు. "ఆ కంపెనీ గుడ్‌విల్ దెబ్బతిందిరా! పదిరూపాయలకు కొంటారన్న నమ్మకం కూడా లేదు. తెలిసీ, తెలీని వ్యవహారాలు నీకెందుకంటే విన్నావు కాదు". అసలు సంగతి బయటపెట్టాడు.

కొద్దిసేపు శంకరం నోటమాట పెగల్లేదు. పిచ్చిచూపులు చూస్తుండిపోయాడు. కళ్లలోకి నీరు అలలు అలలుగా పొంగుకువస్తున్నది. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

"అన్నా! వచ్చిన కాడికి తెగనమ్మి పెట్టు. ఫైనాన్స్ వాళ్లకు వడ్డీ జమవేస్తేనన్నా కొంత గడువు దొరుకుతుంది. నాన్నకు తెలిసేలోగా ఏదో ఉపాయం చూడొచ్చు". చెప్పి వెనుదిరిగాడు.

నెల తర్వాత రాజారావును కలిశాడు.

"ఎనిమిది రూపాయల చొప్పున అమ్మేసరికి బ్రోకర్‌కి తలప్రాణం తోకకొచ్చిందట. అమ్మి పెట్టినందుకు కమీషన్ పోను మిగిలిన డబ్బు ఇదిగో" అంటూ డబ్బు తెచ్చి చేతిలో పెట్టాడు రాజారావు.

ఇరవైఐదు వేలు పెట్టి కొంటే చివరకు ఎనిమిది వేలన్నా దక్కలేదు. డబ్బందు కుంటుంటే శంకరం చేతులు వణికాయి.

'నా రోజులు బాగుండి డబ్బందక కొనలేదు. నా స్నేహితులు ఈ గొడవ ముందే పసిగట్టి అయినకాడికి అమ్ముకుని నష్టం లేకుండా బయటపడ్డారట. ఇలా జరగటం నీ దురదృష్టంరా!" సానుభూతి చూపాడు రాజారావు.

"నమ్మబలికినోడికి సొమ్ము, నమ్మినోడికి దుమ్ము! ఏమనుకోనేం లాభంలే!" కన్నీళ్లు తుడుచుకున్నాడు శంకరం.

ఆ డబ్బు తీసుకెళ్లి ఫైనాన్స్‌వాళ్లకు వడ్డీ కింద జమవేయించి గడువు ఇమ్మని కాళ్లు వేళ్లాపడి సరేననిపించుకున్నాడు.

ఆ తర్వాత అసలుగాని, వడ్డీగాని చెల్లువేసే అవకాశం చిక్కలేదు. నోటు గడువు తీరబోతున్నదని ఫైనాన్స్‌వాళ్లు ముందు జాగ్రత్తగా లాయర్ నోటీసు ఇచ్చారు.

* * *

కొడుకు ద్వారా అంతా తెలుసుకున్న చలమయ్య కోపం నిగ్రహించుకోలేకపోయాడు. మొకరానికున్న పలుపుతాడు లాగి శంకరం వళ్లు వాతలు తేలేలా కొట్టాడు. సత్యవతి నెత్తీనోరు కొట్టుకుంటూ అడ్డుపడింది.

"చెట్టంత బిడ్డను కొట్టేందుకు చేతులెట్టావస్తన్నయ్! ఇంత ఆస్తీ ఎవరు నుప్పేస్తే కర్పూరంలా కరిగిపోయింది? ఇట్లా శని రాసుంటే ఆడేం చేస్తాడు?" బిడ్డను వాటేసుకుని దెబ్బలు కాసుకుంటూ బావురుమన్నది.

"ఉన్ననాలుగెకరాలు అప్పులపాలుజేసి, ఎదిగిన పిల్లను ఏ అయ్యచేతిలో పెడ్తామే! ఇంత బతుకు బతికినూళ్లో పూట గడవటంకోసం కూలంటూ ఎన్ని గడపలెక్కి దిగాల్నో వాడ్నే చెప్పమను!" అంటూ తల్లడిల్లిపోయాడు చలమయ్య.

చలమయ్య ఆవేశం కాసేపటికి తగ్గుముఖం పట్టింది. తండ్రిచేత తిన్న దెబ్బలకు బాధను మూగగా దిగమింగుకుంటూ ఒక మూల పడున్న బిడ్డను చూస్తూ కడుపు తరుక్కుపోతుంటే వుండుండి ఏడుస్తున్నది సత్యవతి. చుట్టింట్లో మోకాళ్ల మధ్య తల ఇరికించుకుని పసిదానిలా వెక్కిళ్లు పెడ్తున్నది కస్తూరి. శంకరం పుట్టి బుద్ధెరిగాక తప్పుచేసి మాట పడ్డవాడూ కాదు, దెబ్బలు తిన్నవాడూ కాదు.

ఇంట్లో వుండేందుకు మనస్కరించక వీధిలోకి నడిచాడు చలమయ్య. కాళ్లెటులాగితే అటు నడుస్తున్నాడు. ఆలోచనలు గత జీవితంలోకి జారిపోయాయి.

పాతిక ఎకరాల భూమి, మూడు జతల ఎడ్లు, ఆరేడు పాడి గేదెలు తండ్రి అప్పగించాడు. ఇద్దరు జీతగాళ్లున్నా సేద్యపు పనులతో కూసింత తీరిక చిక్కేది కాదు. పాడిపంటలతో జీవితం పచ్చగా కళకళలాడుతుండేది. నేడు ఆ వైభవం, వైభోగం ఏవి?

ఊటలేని బావిలో ఎన్నిమార్లు బొక్కెన వేస్తే మాత్రం నీటితో నిండుతుందా? యగసాయం కూడా అంతే!

తనొకరకంగా, తన బిడ్డ మరొక రకంగా మోసపోయారు. మోసగించటమే తెలివి తేటలకు గీటురాళ్లుగా చెలామణి అవుతున్నరోజులివి.

తండ్రిపోయి, యగసాయం తన పెత్తనం కింది కొచ్చిన యేడాది. దొరపొగాకు వేస్తే మంచి దిగుబడి వచ్చి వేలకు వేలు ఆదాయం వస్తుందని ఆశతో రైతులు పోటీలు పడుతున్నకాలం. ఏకంగా ఇరవై ఎకరాల్లో పొగాకు వేయాలని తలపెట్టాడు. ఊపిరి సలపని పనులు.

పొలం దుక్కులు దున్ని, పదును చేసి, నారు కొనితెచ్చి నాటేశాడు. సకాలంలో వానలొచ్చి మొక్కల్ని సాకినయ్! ఎరువులు, పురుగులమందులు అవసరమెరిగి చల్లాడు. కాడలు నిలువెత్తు లేచి, ఆకులు ఏనుగు చెవుల్లా దిగబారినయ్! చూసినోళ్ళంతా నోరెళ్ల బెట్టారు. వంద క్వింటాళ్ల పైనే దిగుబడన్నారు. చలమయ్య దశమంతుడన్నారు. కాదు పిల్లల అదృష్టమన్నారు.

ఆకు విరిసి గుర్రాలతో (కర్రలకు ఆకులు అల్లే కొయ్య పరికరం) కర్రలకు పొగాకు అల్లించి, బేరన్‌లకు ఎక్కించాడు. ఆకును కాల్పించి, బేరన్ దించాడు. పందిరిలో రాక్స్ పెట్టించాడు. పదునైన రోజు చూసుకొని మండెలు తొక్కించాడు. ఆకులు గ్రేడ్ చేయించాడు. ఒకటో నంబరాకు వంద క్వింటాళ్లయింది.

కంపెనీ బయ్యర్లు ఎగబడ్డారు. ఎరవేశారు. పోటీలు పడ్డారు. సరుకిచ్చిన నెలలో డబ్బిస్తామన్నారు. మంచి రేటుకు బేరం కుదుర్చుకుని పంట అప్పగించాడు.

నెలాగి డబ్బు కోసం కంపెనీకి వెళ్లాడు. ఇదిగో నిన్ననే సరుకు విదేశాలకు ఎక్కించామన్నారు. నెలాగి రమ్మంటే వెళ్లాడు. డబ్బు ఇంకా అందలేదంటూ ఒక వంతు మాత్రం ఇచ్చారు.

విదేశాల్లో అనుకున్నంత రేటు పడలేదనీ, నష్టపడ్డామనీ, మరికొంత వ్యవధి ఇమ్మనీ దొంగ ఏడుపులు ఏడిచారు. నమ్మాడు తను.

తొలకరొచ్చింది. తిరిగి పొగాకే వేశాడు తను.

"మేం ఇబ్బందుల్లో వున్నా మీకు పెట్టుబడులకు అవసరం గదా!" అంటూ మరికొంత డబ్బిచ్చారు.

మరుసటి యేడు కూడా మంచి దిగుబడొచ్చింది. బయ్యర్లు ఎగబడసాగారు. రేటు ఐదో పదో తక్కువైనా మంచి కంపెనీవాళ్లకు పంట ఇద్దామనుకున్నాడు.

ముందరేడు బకాయివున్న కంపెనీవాళ్లూ వచ్చారు. వడ్డీ కలిపి పాతబాకీ, కొత్త పంట డబ్బూ అణాపైసల్తో అప్పగిస్తామన్నారు. కాదంటే పాతబాకీకి నీళ్లొదులుకోవాల్సి వస్తుందని భయపడ్డాడు. వ్యాపారస్తులకు మాత్రం ఇబ్బందులుండవాని, మాట నమ్మకంమీద వాళ్లకే పంట అమ్మాడు.

ఏడాదిపాటు తిరిగినవాడు తిరిగినట్లే వున్నాడు. అదిగో ఇదిగో అంటూ వాయిదాలు. తియ్యటి కబుర్లు. అప్పుచేసి తెచ్చిన పెట్టుబడులకు వడ్డీలు పెరుగుతున్నాయి. గట్టిగా నిలదీస్తే వెయ్యో, రెండువేలో చేతికిస్తున్నారు. ఇవ్వాల్సింది లక్షకు తక్కువుండదు. తనలానే దిక్కుతోచక తిరుగుతున్న ఎందరో రైతులు.

ఓసారి వెళ్లేసరికి కంపెనీకి తాళాలు పెట్టి ఉన్నాయి. దివాళా తీసిందన్నారు నష్టాలొచ్చి. కంపెనీ పెట్టిన పెద్దలుమాత్రం బంగళాల్లో వుంటూ కార్లలో తిరుగుతూనే వున్నారు.

నిజం నిలకడ మీద తెలిసింది. అదొక బినామీ కంపెనీ. ఊరూ పేరు లేనివాడి పేరు మీద పెట్టారు. సరుకు తరలించి, దొంగలెక్కలు రాయించి, కాగితాల మీద దివాళా తీయించారు. లక్షలాది రూపాయిలు పొట్టనేసుకున్నారు. అమాయక రైతుల్ని నిలువునా ముంచారు.

తను పోలీసు కేసు పెట్టాడు. అయిదూ పదీ తిన్నారు. హడావుడీ చేశారు. పట్టనూ లేదు. శిక్షలు వేయించనూ లేదు.

"ఎందుకు సామీ! పనులొదులుకొని పిచ్చోడిలా టేసెను చుట్టూ తిరుగుతావు? బుగ్గయిందేదయినా తిరిగి చేతికి అమరుద్దా. ఇవి పెద్దోళ్ల యవ్వారాలు. ఏ నోటి కందాల్సింది ఆ నోటికందాక నీ తరపున నోరు తెరిచేదెవరు? పోకుండా మిగిలిందే దక్కుదలనుకో. వెళ్లెళ్లు". రోజూ పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతుంటే జాలిపడి ఒక పోలీసు నిజం చెప్పాడు.

అప్పులు తీర్చటానికి వున్న పళంగా ఐదెకరాలు తెగనమ్మాల్సి వచ్చింది.

పోయిందెటూ పోయింది. గుండెలో బలం ఉంది. చేతుల్లో సత్తువుంది. కురిసేందుకు మబ్బుల్లేవా! చినుకులు బడితే పదునెక్కటానికి ఇరవై ఎకరాల కొండ్ర లేదా! గింజలు

చల్లితే పేనం పోసుకుని మొలకెత్తవా! మొక్కలు చల్లని మా తల్లుల్లా పంటల్ని కనవా! బిడ్డలకోసం ధైర్యం కూడదీసుకుని దుఃఖం దిగమింగుకున్నాడు.

నాగేటి చాళ్లను ఇరవైయేళ్ల పైనే చెమటతో తడిపి సేద్యం చేశాడు. వర్షాలు కురవకో, గాలిపాటు తప్పో పండలేదనుకున్న యేడాది ఖర్చులు దండగ పడితే, పండిందనుకున్న యేడు గిట్టుబాటు ధరలు లేక మిగులు తేలేది కాదు. చిగుళ్లేస్తుందనుకున్న జీవితం మోడుబారే వుంది. ఆదాయం మించిన సేద్యపు ఖర్చులు, కుటుంబ అవసరాలు భూమిని ముక్కలుగా మింగేశాయి.

చివరకు మిగిలింది నాలుగెకరాలు. అదీ ఇప్పుడున్న అప్పు తీర్చాలంటే అమ్మక తప్పదు. అమ్మి బాకీలు తీరిస్తే మిగిలేది ఎంత? కూతురి పెళ్లి ఎట్లా చెయ్యాలి? ఏం చేసుకు తినాలి? ఏది చూసుకు బతకాలి?

చలమయ్య ఆవేదనతో కుమిలిపోసాగాడు. బ్రతకాలనే ఆశ ఒక్కసారిగా సన్నగిల్లింది. ఆ బలహీన క్షణాల్లో అతనో నిశ్చయానికొచ్చి ఇంటికేసి నడిచాడు.

ఇంట్లోకి వెళ్ళి నిశ్శబ్దంగా అల్మారా వెదికాడు. కావాలనుకున్నది అనుకున్న చోట లేదు. నాలుగు రోజుల క్రితం తనే సర్దిపెట్టాడు. కొడుకూ, తనూ ఒక విడత కొస్తుందని లెక్కలు గట్టారు. ఇంతలోకి ఏమైంది? దాంతో ఎవరికి అవసరమొచ్చింది?

ఉన్నట్లుండి ఒక ఆలోచన తళుక్కున మనస్సులో మెదిలి ఉలిక్కిపడ్డాడు. గుండె గుభేలు మన్నది. నిలువునా వణుకు పుట్టుకువచ్చింది.

"ఏవే! శంకరం ఏడి?" ఇంట్లో కలయజూస్తూనే ఆదుర్దాగా భార్యను అడిగాడు.

"ఇంతకుముందే బయటికెళ్లినట్టున్నాడు!" చెప్పిందామె. "ఏమన్నా చెప్పాడా?"

"బిడ్డ చెప్తేమాత్రం చెవినేసుకునే వాళ్లున్నారా?" ఆమె కంఠంలో దుఃఖం పొంగుకొచ్చింది.

చలమయ్య కొచ్చిన అనుమానం బలపడింది. క్షణాలు లెక్కిస్తూ కూచుంటే ప్రాణాలు దక్కవనుకున్నాడు. ఒక్క ఉదుటున బయటపడ్డాడు.

గనేల మీదుగా, పొలాల కడ్డంపడి పరిగెత్తసాగాడు. ఆయాసంతో వగరుస్తున్నాడు. సరిగా పెరకని పత్తి మొదళ్లు పాదాల్ని కుళ్లబొడుస్తున్నాయి. రక్తపు చారికలతో మట్టిపెళ్లలు ఎర్రబడుతున్నాయి.

"ఒరే! కన్నోళ్లకు కడుపుకోత పెట్టమాకురా!" పదేపదే సణుగుతూ పరిగెడుతున్నాడు. కళ్లు జలపాతాల్లా వర్షిస్తున్నాయి.

కావలి మనిషొకడు వూళ్లోకొస్తూ తారసపడ్డాడు. "వీరయ్యా! మా శంకరంగాని కంటబడ్డాడ్రా నీకు?" రొప్పుతూ అడిగాడు.

"అవుపడ్డాడయ్యా! ఈ యాలప్పుడు ఎక్కడికని అడిగితే, 'యాలదేవుందిరా! ఎల్లాల్సిన చోటికే ఎల్తన్నాలే' అన్నాడు". చెప్పాడు వీరయ్య.

"దేవుడా! బిడ్డని దక్కించు!" అనుకుంటూ శక్తిని కూడదీసుకుని ముందుకు దూసుకెళ్లసాగాడు చలమయ్య.

పడమటి ఆకాశంలోకి వాలుతున్న సూర్యుడు పరిగెడుతున్న చలమయ్యకు తోడు నడుస్తున్నట్లుగా వుంది.

చేలోకి అడుగు పెట్టాడు. పత్తిమండెల చాటుకి పరిగెత్తాడు. పురుగుమందు సీసా మూత సీలు దీసే ప్రయత్నంలో వున్న కొడుకు కంటబడేసరికి ప్రాణం లేసొచ్చింది.

"రేయ్! నువ్వు మట్టయితే ఏం జాసుకు బతకాలిరా! నా తల కొరివి పెట్టాల్సినోడివి. ఆ మందు ముందుగా నా గొంతులో పొయ్యి" అంటూ కొడుకు ప్రక్కన నిస్సత్తువగా కూలబడ్డాడు.

శంకరం నిర్ఘాంతపోయాడు. పురుగుమందు సీసా చెయ్యి జారింది.

"అయ్యా! ఈ భూమిని నమ్ముకున్నంత కాలం ఈ దరిద్రం తీరదనుకున్నా! దారి మళ్లితేనన్నా సుఖపడ్తామని ఆశపడ్డానయ్యా! కాని ఇట్లా దారితప్పి గోతిలో బడతాననుకోలేదు". ముఖాన్ని చేతుల్లో దాచుకుని ఏడవసాగాడు.

"శంకరం! విత్తనాలు నాటాల్సిన ఈ చాళ్లలో నిన్ను పాతటానికట్రా ఇన్నేళ్లు పేనానికి పేనంగా సాకింది?" అంటూ కొడుకుని పసివాడిలా గుండెల్లోకి పొదువుకుని మూగగా రోదిస్తుండిపోయాడు చలమయ్య.

*(ఆహ్వానం, మే 1995)*